

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ

కలెక్టర్ రాహుల్ శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఫీజు చెల్లింపులో 25శాతం రాయితీ అవకాశం కల్పించినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో మునిసిపల్, పట్టణ ప్రణాళిక, పంచాయతీశాఖ అధికారులతో ఆయన గురువారం సమవేశమయ్యారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కరంపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మునిసిపల్, పంచాయతీ పరిధిలో పంచాయితీ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, టీపీవో సునీల్, డీపీవె కార్యాలయ ఏవో బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్



సిబ్బందితో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని అన్ని రకాల పన్నుల వసూలు వందశాతం పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం సాయంత్రం సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఇతర బకాయిలను మార్చి 31లోగా పూర్తి స్థాయిలో వసూలు చేయాలని సూచించారు. మొండి బకాయిలు ఉన్నట్లయితే మునిసిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు కూడా తమకు సహకరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆధార్.. బేజార్


మూసి ఉన్న మునిసిపాలిటీలోని ఆధార్ కేంద్రం

భూపాలపల్లిలో మూసి ఉన్న ఆధార్ కేంద్రం

- సరిగా పని చేయని సెంటర్లు
- సమయం పాటించని నిర్వాహకులు
- గంటల తరబడి నిరీక్షించినా అందని పౌర సేవలు
- అధిక ధరలు వసూలు.. కనిపించని పట్టిక

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 'ఆధార్' అనేది భారతీయులు అందరూ కలిగి ఉండాల్సిన గుర్తింపు కార్డు. దీని నంబరే కీలకం. దేశ పౌరులని చెప్పుకోవడానికి ఇదే ప్రామాణికం. ఇప్పుడే పుట్టినప్పటి నుంచి కాటికి పోయేంత వరకు ఇది తోడుగా ఉండాల్సిందే. లేదంటే అనేక సమస్యలు ఎదురవుతాయి. ఈ ప్రత్యేక నంబరు ద్వారా పౌరుల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద నిక్షిప్తమై ఉంటాయి. అవసరాన్ని బట్టి ఈ నంబరు ప్రతి ఒక్కరికీ ఉపయగపడుతుంది. అయితే.. ఆధార్‌కార్డును కొత్తగా తీసుకోవాలన్నా, అందులో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నా ఇప్పుడు పెద్ద టాస్కే. భూపాలపల్లి జిల్లాలో ఆధార్ సెంటర్లు సరిగా పనిచేయకపోవడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జనాభాకు సరిపడా ఆధార్ కేంద్రాలు లేకపోవడం, ఉన్న కొద్ది సెంటర్లు కూడా సరిగా పనిచేయకపోవడం సమస్యగా మారింది.

భూపాలపల్లి జిల్లాలో ఆరు ప్రభుత్వామోదిత, ఐదు ప్రభుత్వేతర ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. మల్హర్, పలిమెల, టేకుమట్ల మండలాల్లో ఒక్క కేంద్రం కూడా లేకపోవడంతో ఆ మండలాల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న కేంద్రాలకు వ్యయప్రయాసాలకోర్చి రావాల్సి వస్తోంది. ఇక్కడా వీరికి సకాలంలో సేవలు అందడం లేదు. సమయానికి సెంటర్లను తెరవకపోవడం, తెరిచినా సిబ్బంది అందుబాటులో లేకపోవడం, సర్వర్ డౌన్, ఎర్రర్ అని సాకులు చెప్పడం పరిపాటిగా మారింది. సుదూర గ్రామాల నుంచి వచ్చిన వారు కూడా గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వీరి పట్ల కొన్ని సెంటర్ల నిర్వాహకులు దురుసుగా మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. కొందరు నిర్వాహకులు అనేక కొర్రీలు పెట్టి డబ్బులు కూడా దండుకుంటున్నట్లు సమాచారం.


తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో వేచిచూస్తున్న ప్రజలు

ఏ సేవకు ఎంత రుసుమో?

ఆధార్ కేంద్రాల్లో ఏ సేవకు ఎంత రుసుమో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. దేనికి ఎంత రుసుము ఉంటుందోననే చార్ట్ ప్రతి కేంద్రంలోనూ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. కానీ, అవేమీ కానరావడం లేదు. అలాగే, తీసుకున్న రుసుముకు రశీదులు సైతం ఇవ్వడం లేదని తెలుస్తోంది. అత్యవసరంగా ఏదైనా కావాల్సిన వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలోని ఆధార్ కేంద్రాలివే..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో భూపాలపల్లి మునిసిపాలిటీలో 1, భూపాలపల్లి తహసీల్ కార్యాలయంలో 1, మహదేవపూర్ తహసీల్ కార్యాలయంలో 1, కాటారం తహసీల్ కార్యాలయంలో 1, మొగుళ్లపల్లి జీపీలో 1, చిట్యాల తహసీల్ కార్యాలయంలో 1 ఇలా.. మొత్తంగా ఆరు కేంద్రాలు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆంధ్రబ్యాంకులో 1, తెలంగాణ గ్రామీణ బ్యాంకు 1, సీఎస్‌సీ సెంటర్‌లో 1, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో 1.. ఇలా మొత్తం ఐదు ప్రభుత్వేతర కేంద్రాలు ఉన్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఆధార్ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ఇక్కట్లు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సరైన పర్యవేక్షించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఆధార్‌సెంటర్లలో ఇష్టారాజ్యం సాగుతోందని విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..

- శ్రీకాంత్, ఈ-డిస్ట్రిక్ మేనేజర్, భూపాలపల్లి జిల్లా

ప్రభుత్వ ఆదీనంలో నడుస్తున్న ఆధార్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉంది. జిల్లాలో ఆరు కేంద్రాలు ప్రభుత్వ ఆదీనంలో నడుస్తున్నాయి. ఆయా కేంద్రాలన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఉన్నాయి. ఇబ్బందులు ఎదురవుతున్న విషయాలేమి మా దృష్టికి రాలేదు. నిబంధనల మేరకు ఆధార్ కేంద్రాలు కొనసాగేలా చర్యలు చేపడుతాం.

పని కాక.. సమాచారం తెలియక..

ఆధార్ కేంద్రాల్లో జనం అయోమయానికి గురికావాల్సి వస్తోంది. చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డు దరఖాస్తు చేసుకోవాలన్నా, కొత్తగా వివాహం చేసుకొని వచ్చినవారి చిరునామా మార్పుతో పాటు ఆధార్‌కార్డులో సవరణ చేసుకోవాలన్నా పెద్ద సమస్యగా మారింది. ఈ పనులు ఆయా సెంటర్లలో సాఫీగా జరగడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. వీటితో కొన్ని బ్యాంకు పరిధిల్లో నడుస్తున్న ఆధార్ కేంద్రాల ఆపరేటర్లు సమయ పాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వామోదంతో నడిచే కేంద్రాల్లో సైతం ఇష్టారాజ్యం నెలకొందని తెలుస్తోంది. ఆపరేటర్ల మాటతీరు సరిగా ఉండటం లేదని, తామొచ్చిన పనేమిటో, దానికి కోసం ఎలాంటి పత్రాలు అవసరమో చెప్పడానికి కూడా వారు ఇష్టపడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదైనా అడిగితే కసురుకోవడం తప్ప సరైన సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ సెకెండియర్ పరీక్ష తొలిరోజు ప్రశాంతం


భూపాలపల్లిలోని పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు

31 మంది గైర్హాజరు

భూపాలపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య విద్యార్థులు పరీక్షలు రాశారు. 1688 మంది విద్యార్థులకు 1657 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. జీరో మాల్ ప్రాక్టీస్‌తో పరీక్షలు సజావుగా జరిగాయి. తాడిచర్ల (మల్హర్) మండలంలో 134 మంది విద్యార్థులకు ఒక్కరే గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 118 మంది, వొకేషనల్ విద్యార్థులు 15 మంది ఉన్నారు. అలాగే మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 142 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారు. ఇక్కడ జనరల్ విద్యార్థులు 105, వొకేషనల్ 34 మంది ఉన్నారు. కాటారం ప్రభుత్వ కళాశాలలో 195 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరయ్యారు. భూపాలపల్లి జూనియర్ కళాశాలలో 238 మందికి 13 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 160 మంది, వొకేషనల్ విద్యార్థులు 65 మంది ఉన్నారు. చిట్యాలలో 306 మందిలో అందరూ హాజరుకావడం విశేషం. అలాగే కాటారం మండలం గంగారం గ్రామంలోని టీజీఎంఎస్ పరీక్ష కేంద్రంలో 141 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారు. చిట్యాల టీజీఎంఎస్‌లో 308 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారు. తేజస్విని జూనియర్ కళాశాలలో 221 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారు. మొత్తం ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 1462కు 1442 మంది హాజరు కాగా, వొకేషనల్ విద్యార్థులు 226 మందికి 215 మంది హాజరయ్యారు. మొత్తం 1688 మందిలో 31 మంది గైర్హాజరయ్యారు. 98 శాతం మంది హాజరు కాగా 1.80 శాతం గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ నోడల్ కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు.

ములుగు జిల్లాలో 47 మంది గైర్హాజరు

ములుగు (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు/సంస్కృతం/హిందీ పరీక్ష జరగా 1853 మందికి 1.806 మంది హాజరయ్యారు. జనరల్‌లో 41 మంది, వొకేషనల్‌లో ఆరుగురు పరీక్షకు హాజరు కాలేదు. అధికారులు పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ ఐదు చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

అదే ప్రదేశం.. అదే ఊరు వ్యక్తి

- రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు
- రాంపూర్ వద్ద మళ్లీ రోడ్డు ప్రమాదం
- క్షతగాత్రుడు మీనాజిపేట వాసి
- మూడు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఇద్దరు అదే ప్రదేశంలో దుర్మరణం

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలం రాంపూర్ సమీపంలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈనెల 3న ఇదే ప్రదేశంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహాముత్తారం మండలం మీనాజీపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తాజాగా అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అదే ప్రదేశంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఒకే గ్రామానికి చెందిన వారు ఒకే ప్రదేశంలో వరుసగా రోడ్డు ప్రమాదాలకు గురికావడం యాధృచ్ఛికమైనా ఈ వరుస ఘటనలపై విస్మయం వ్యక్తమవుతోంది. మహాముత్తారం మండలం మీనాజిపేట గ్రామానికి చెందిన కంకణాల చంద్రమౌళి-రాజేశ్వరి దంపతులు ఓ వివాహ శుభాకార్యానికి భూపాలపల్లికి వచ్చారు. తిరిగి గురువారం సాయంత్రం ఇంటికి ద్విచక్ర వాహనంపై పయనమయ్యారు. రాంపూర్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ సమీపంలో కొద్దిసేపు సేద తీరేందుకు రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపారు. ఈ క్రమంలో రాంపూర్ వైపు నుంచి భూపాలపల్లి వైపు వస్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో చంద్రమౌళి కిందపడిపోగా అతడికి తీవ్ర గాయాలయ్యాయి.


గాయపడ్డ చంద్రమౌళి

అతడి సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడింది. తీవ్రంగా గాయపడిన చంద్రమౌళిని స్థానికులు భూపాలపల్లి జిల్లా కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చంద్రమౌళి చికిత్స పొందుతుండగా అతడి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి ఎస్సై రమేష్ పరిశీలించారు.

అడవిలో అగ్ని జ్వాలలు


అడవిలో మంటలను ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి అటవీశాఖ రేంజ్ పరిధిలోని అడవిలో గురువారం అగ్గి రాజుకుంది. సుమారు అరకిలో మీటరు మీర మంటలు వ్యాపించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మంటలను ఆర్పివేశారు. వేసవి దృష్ట్యా అడవిలో మంటలు వ్యాప్తి చెందకుండా ప్రతీ ఒక్కరు సహకరించాలని అటవీశాఖ రేంజ్ అధికారి నరేష్ బసవ కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

చిట్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురతండాలో జరుగనున్న బాల్య వివాహాన్ని గురువారం పోలీసు, రెవెన్యూ శాఖలు, బాలల పరిరక్షణ సమితి అధికారులు అడ్డుకున్నారు. 16 సంవత్సరాల బాలికకు వివాహ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం రావడంతో చిట్యాల రెండో ఎస్సై ఈశ్వరయ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేశారు. బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహం జరిపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ల రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ లింగన్న, నాగరాజు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య


పల్లవి (ఫైల్)

చిట్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఒడితలలో గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్రబెల్లి సదానందం, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె పల్లవి (19) ఉన్నారు. పల్లవి హనుమకొండలోని ఓప్రైవేటు కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న పల్లవి గ్రామదేవతల ఉత్సవాల కోసం ఇటీవల ఇంటికి వచ్చింది. తల్లి విజయ కూడా కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె ఆపరేషన్‌కు రూ. 6లక్షలపైగా అవసరం ఏర్పడింది. ఇద్దరి చికిత్సకు డబ్బులేక కుటుంబ సభ్యులు బాధపడుతున్నారు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన పల్లవి తెల్లవారుజామున ఇంట్లోని వంట గదిలో ఉరేసుకుంది. మృతురాలి తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల రెండో ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్

వెంకటాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మిర్చి కల్లాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రంలో జరిగిన జిల్లా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఎకరం మిర్చి పంటను సాగు చేసేందుకు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కింటాల్‌కు రూ.25 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, గ్యానం వాసు, చిట్టెం ఆదినారాయణ, కుమ్మరి శ్రీను, తోట నాగేశ్వర్‌రావు, కట్ల నర్సింహాచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల గెలుపుతో బీజేపీ సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు

తొర్రూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిలో బీజేపీ ఎమ్మెల్సీల ఘన విజయాన్ని హర్షిస్తూ గురువారం తొర్రూరు రూరల్, అర్బన్ కమిటీల ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్ మాట్లాడుతూ మూడు స్థానాల్లో రెండింటిలో బీజేపీ విజయం సాధించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణలో ఇదే పరంపర కొనసాగుతుందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైండ్ల రాజేష్, రచ్చ కుమార్, రాంబాబు, రవిబాబు, యాకయ్య, శేఖర్, విజయ్‌కుమార్, నవీన్, సంతోష్, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

16న జనగామ జిల్లాకు సీఎం రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

జనగామ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఈనెల 16న సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి, రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్, సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయ సముదాయం, విద్యుత్ సబ్‌స్టేషన్, గ్రామ పంచాయతీల్లో ఎంపిక చేసిన ఇందరమ్మ ఇండ్లు, ఇతర అబివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, డీఆర్డీవో వసంత, డీఎంహెచ్‌వో మల్లికార్జున రావు, డీపీవో స్వరూప, హౌసింగ్ పీడీ మాతృనాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ పాల్గొన్నారు.

అలుపెరుగని యాత్రికుడు

- పశ్చిమ బెంగాల్ నుంచి యువకుడి సైకిల్ యాత్ర
- రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు..



చీకుపల్లికి చేరుకున్న బిప్లక్‌సింగ్

వాజేడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ఓ యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. పశ్చిమ బెంగాల్ నుంచి బయల్దేరి దేశమంతటా పర్యటిస్తున్నాడు. పొరుగు దేశాలైన నేపాల్, భూటాన్‌కూ అదే సైకిల్‌పై వెళ్లొచ్చాడు. అనేక మైలు రాళ్లు దాటుతూ ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లికి చేరుకున్నాడు.

పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాకు చెందిన బిప్లక్ సింగ్ సైకిల్ యాత్ర చేపట్టాడు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపొద్దని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్నాడు. ఏడాదిన్నర కాలంగా అన్ని రాష్ట్రాలను తిరుగుతూ వాజేడుకు చేరుకున్నాడు. ఇప్పటి వరకు 27వేల కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కుతూ పర్యటించానని తెలిపాడు. మహాకుంభామేళా జరిగిన ప్రయాగ్‌రాజ్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దాటుకొని తెలంగాణ మీదుగా ఒడిశా వెళ్తున్నానని తెలిపాడు.

విశ్రాంతి గదిలో మద్యం తాగిన కానిస్టేబుళ్లు!

- సామాజిక మాధ్యమాల్లో వైరల్



విశ్రాంతి గదిలో మద్యం తాగుతున్న కానిస్టేబుళ్లు

పెద్దవంగర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌లోని విశ్రాంతి రూములో కానిస్టేబుళ్లు మద్యం తాగిన ఫొటోలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లోని విశ్రాంతి రూములో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ కలిసి మద్యం సేవించారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థానిక ఎస్సై క్రాంతికిరణ్ వివరణకోరగా బుధవారం రాత్రి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ విధులు ముగించుకొని రాత్రి భోజనం చేయడానికి విశ్రాంతి రూము వెళ్లారని, వారు విధుల్లో లేరని ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పెడితే క్రిమినల్ కేసులు

దంతాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పెడితే క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఈ వినయ్ హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ శివారు వద్ద డీబీఎం 60 కెనాల్ ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీబీఎం 60నుంచి వెళ్లే ఉప కెనాల్‌కు గండ్లుకాని మట్టి తొలకడం జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు యాసంగిలో నీటిని అందించేందుకు మార్చి 30 వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తామన్నారు. కెనాల్ గేట్లను ఎత్తివేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరిపెడ మండలంతో పాటు చివరి ఆయ కట్టు వరకు నీటిని విడుదల చేస్తామన్నారు.

రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



కేసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైనులో 418/26-28 కిలోమీటరు వద్ద గురువారం తెల్లవారుజామున వేగంగా వెళుతున్న రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు తెలిపారు. రైలులో నుంచి పడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై నలుపు రంగు లోయర్ ప్యాంట్, పసుపు రంగు టీషర్టు ఉన్నాయని, ఛాతిపై 'వీటీ' అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు 9441557232 సెల్ నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి



శ్రామిక మహిళా జిల్లా సదస్సులో మాట్లాడుతున్న కాసు మాధవి

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తితో శ్రామిక మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రామిక మహిళా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమపై జరుగుతున్న దోపిడి, పీడనలకు వ్యతిరేకంగా పని గంటల తగ్గింపు, ఓటు హక్కు కోసం శ్రామిక మహిళా లోకం సుదీర్ఘపోరాటాల ఫలితంగా 115 సంవత్సరాల క్రితం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందని చెప్పారు. సమాజంలో తరతరాల నుంచి ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో వెళ్లూనుకుని ఉండడం మూలంగా మహిళలు అవమానాలు, హింస, దాడులకు గురవుతున్నారని చెప్పారు. మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, కుమ్మరికుంట్ల నాగన్న, దారా స్నేహబింధు, బెస్త సంపూర్ణ, లలిత, సంధ్య, సలీమా, జ్యోతి, శ్రావణి, ఉమ, వీరలక్ష్మి, అనురాధ, కాంతి, మంజుల పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు, నిర్వాహకులు

కాటారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గుండ్రాత్‌పల్లి జీపీ పరిధి మల్లారంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్థులు, పలువురు దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గురువారం జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, సన్నాయి వాయిద్యాల చప్పుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య యంత్ర, విగ్రహ ప్రాణ పతిష్ఠ కనులపండువుగా సాగింది. పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఉత్సవాల్లో పాల్గొని ఆంజనేయ స్వామిని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోనె కపిల్, గోనె మనోహర్, తిరుపతి, బాపు, మధునయ్య, సమ్మయ్య, నాగరాజు, రాజేందర్, మహేందర్, శ్రీకాంత్, ప్రశాంత్, పోచయ్య, అనిల్, రాజు, కరుణాకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై ఠాణాలో ఫిర్యాదు

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీరిశెట్టిగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ నెహ్రూపై గురువారం పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తనపేరుపై నుంచి జీపీకి మార్చుకోవాలంటూ నెహ్రూ ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకెళ్లడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై నెహ్రూను వివరణ కోరడంతో బీరిశెట్టిగూడెం జీపీకి చెందిన ట్రాక్టర్‌ను తన పేరిట గత ప్రభుత్వ హయాంలో బ్యాంకు లోన్ తీసుకున్నారన్నారు. ఇటు గ్రామపంచాయతీ అధికారులు 14 నెలల నుంచి బ్యాంకుకు లోన్ కట్టకపోవడంతో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ ధ్యేయం


- పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ



కాంగ్రెస్ మహిళా కార్యకర్తలతో సుగుణ

గోవిందరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారతే కాంగ్రెస్ ధ్యేయమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంగోత్ సుగుణ అన్నారు. మండల కేంద్రంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి ఆధ్వర్యంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం జరగ్గా ముఖ్య అతిథిగా సుగుణ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. ప్రతి మహిళనూ కోటీశ్వరులను చేసేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చి మహిళలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల్లో నూతన ఒరవడిని సృష్టిస్తూ ఆర్టీసీ బస్సుల నిర్వహణ కూడా అప్పగించనున్నారని అన్నారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా ఇప్పటికే క్యాంటీన్లు పెట్టుకోవడానికి ఆర్థిక సాయం అందించి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి రైల్వేస్టేషన్‌లో మహిళా సంఘాలకు టీస్టాల్స్ ఏర్పాటు చేయడంతోపాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా మహిళాసంఘాలకు ఇస్తున్నారని అన్నారు. ప్రతి మహిళ మండలంలో వెయ్యి సభ్యులకు తగ్గకుండా మహిళా మెంబర్‌షిప్ చేయాలని, పని చేస్తేనే పదవులు దరిచేరుతాయని అన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు జ్యోతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, కర్ల అరుణ, పేడిక లక్ష్మి, గుండెబోయిన నాగలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి పవళింపు సేవ



వీరభద్రుడికి పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కురవి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీభద్రకాళి సమేత వీరభద్రుడి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 10వ రోజు గురువారం రాత్రి స్వామివారి పవళింపు సేవా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భద్రకాళి, వీరభద్రుడికి వస్త్రాల సమర్పణ, బ్రహ్మముడి, ఫలదానం, వంటి పదహారు విధాల పూజా కార్యక్రమాలతో స్వామివారి పవళింపు సేవ కొనసాగింది. ఈ పూజాకార్యక్రమాన్ని ఆలయ అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, విజయ్, పుణ్యమూర్తిల పర్యవేక్షణలో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం ప్రతీ ఒక్కరికి పసుపు, కుంకుమలు, జాకెట్ ముక్కలు బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో మానుకోట డీఎస్పీ తిరుపతిరావు దంపతులు, రూరల్ సీఐ సర్వయ్య దంపతులు, ఈవో సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

- 10 కిలోల సరుకు స్వాధీనం
- మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 10.102 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సర్వయ్య గురువారం తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం... ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లా బానే మండలం బడఖరిడ గ్రామానికి చెందిన బరున బరడ్ వ్యక్తి సూరత్‌లో ఉంటూ కూలీ..నాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిస్సా రాష్ట్రంలో గోపాల్ అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి దానిని విక్రయించేందుకు విజయవాడ వెళ్తుండగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా రైలు దిగి తొర్రూరు మీదుగా వరంగల్ వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. శనిగపురం శివారు బాలాజీ గార్డెన్ క్రాస్‌రోడ్డు వద్ద మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో దిగి పారిపోయే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చి అతన్ని పట్టుకుని తనిఖీ చేయగా బ్యాగులో 10.102 కిలోల ఎండు గంజాయి లభ్యమైనట్లు చెప్పారు. సుమారు దాని విలువ రూ.5,05,100 ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి, ఏఎస్సై జాకీర్, సిబ్బంది అశోక్, రవి, ఉమ, బాలరాజు, లింగారావు, సంతోష్‌కుమార్, కిషన్‌ను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

సిద్ధమైన వసతి గృహం

- దేశాయిపేటలో పూర్తయిన మహిళా ఉద్యోగుల వసతి గృహం
- రూ.4 కోట్లతో నిర్మాణం
- వంద మంది మహిళలతో పాటు పది మంది పిల్లలకు వసతి



మహిళా ఉద్యోగుల వసతి గృహం

పోచమ్మమైదాన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ఉద్యోగులకు ఆశ్రయం కల్పించేందుకు నిర్మించిన వసతి గృహం కండే కేర్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతప్రభుత్వంలో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ, దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం ఆధ్వర్యంలో దేశాయిపేటలో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం సర్వే నెంబరు 61లో 15 గుంటల స్థలాన్ని కేటాయించారు. 2023 జూన్‌లో రూ.4కోట్ల వ్యయంతో నిర్మాణాన్ని చేపట్టారు. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం నిధులతో దీన్ని నిర్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్కింగ్ ఉమెన్స్‌తో పాటు ఉన్నత చదువులు, ఉపాధి-శిక్షణ కోసం వచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా నామమాత్రపు రుసుంతో వసతి, భోజనం కల్పిస్తారు.

పిల్లలకు సైతం

మొత్తం 47 గదులతో వంద మంది మహిళలు, పది మంది పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. వసతిగృహంలో ఉండే మహిళలకు ఎలాంటిఇబ్బందులు తలెత్తకుండా సెక్యూరిటీతోపాటు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి, శిక్షణ కోసం వచ్చే మహిళలకు ఆశ్రయం కల్పించడమే లక్ష్యంగా వసతిగృహాన్ని రూపొందించారు.

రేపు ప్రారంభించనున్న మంత్రి సురేఖ!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మహిళా దినోత్సవం నాడు ప్రారంభించి, మహిళలకు వసతి గృహం సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో పనులు వేగంగా పూర్తి చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2317	2100
పల్లికాయ (సూక)	6950	6500
పల్లికాయ (పచ్చిది)	4600	4400
కందులు	7010	5540
పెసళ్లు	7159	4645
పత్తి	6900	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14150	9000
డిడి	13000	12500
వండర్‌హాట్	16900	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	14000	9500
దేశీ	30000	25500
సింగిల్‌పట్టి	40000	39000
దీపిక	17300	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

యక్షగాన కిరీటి గజవెల్లి

- బాల్యం నుంచే ప్రదర్శనలిస్తున్న సారయ్య
- విభిన్న పాత్రల్లో రాణింపు



'లవకుశ'లో శ్రీరాముడిగా సారయ్య


విరాట పర్వంలో దుర్యోధనుడి పాత్రలో గజవెల్లి సారయ్య

వడ్డేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెవాసుల కట్టుబాట్లు.. తెలంగాణ సంస్కృతి సౌరభాలు.. పురాతన ఆచారాలపై అబ్బురపరిచే ప్రదర్శనలిస్తూ యక్షగాన కిరీటిగా వెలుగొందుతున్నారు గజవెల్లి సారయ్య. పాలబుగ్గల ప్రాయం నుంచే పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ జిల్లా కీర్తిని రాష్ట్ర నలుదిశల చాటుతున్నారు. నటనలో రారాజుగా తన హావభావలతో అబ్బురపర్చే ప్రదర్శనలతో ఔరా అనిపిస్తున్నారు. హసన్‌పర్తి మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన గజవెల్లి సారయ్య కళారంగంలో అందరికి సుపరిచితుడే. ఐదేళ్ల వయసు నుంచే తండ్రి సమ్మయ్య వెంట గ్రామ గ్రామాన తిరుగుతూ ముఖానికి రంగు పులుముకొని ప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రదర్శనల సందర్భంగా ప్రతిఫలంగా గ్రామస్థుల నుంచి నగదు, ధాన్యం, వస్త్రాలు పొందేవారు. లోహితాషుడు, భక్త సిరియాల్, భక్త ప్రహ్లాదుడు, భక్త మార్కండేయ, బాలబద్దిరాజు తదితర పౌరాణిక నాటకాల్లో బాల పాత్రలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. 16 ఏళ్ల వయసు నుంచే శ్రీకృష్ణుడు, భభ్రువాహనుడు, అర్జునుడు, పుండరీకుడు, కీచకుడు, రావణ బ్రహ్మ, మహిరావణుడు, మాయల పకీర్, మాంధాత రాజు, సత్య హరిశ్చంద్ర, హిరణ్యకశ్యకుడు,యమధర్మరాజు లాంటి విభిన్న పాత్రలను పోషిస్తూ ప్రజాదరణ పొందారు. బాల్యంలో నేర్చుకున్న నాటకాలకు మరింత పదును పెట్టిన సారయ్య ఇంతింతై వటుడింతై అన్న చందంగా కళారంగంలో రాణిస్తూ అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి అవార్డులు, రివార్డులు, ప్రశంసలను పొందుతున్నారు. ప్రస్తుతం గజవెల్లి సారయ్య తెలంగాణ రాష్ట్ర చిందు వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ కళాకారుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరులో ఎన్నో చిందు యక్షగాన ప్రదర్శనలు ఇచ్చి ఉద్యమానికి ఊపిరిలూదారు సారయ్య.


అవార్డులతో గజవెల్లి సారయ్య

సారయ్య కళా ప్రదర్శనలో మైలురాళ్లు..

1989 సంవత్సరంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సారా నిషేధం, రూ. 2కే కిలో బియ్యం, ఉచిత కరెంటు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తూ రాష్ట్రంలోని 3 వేల గ్రామాల్లో ప్రదర్శనలిచ్చారు. 1991 నుంచి వరంగల్ ఆకాశవాణి ద్వారా 1500కార్యక్రమాలు హైదరాబాద్ కేంద్రం ద్వారా శ్రోతలకు 300 పౌరాణిక చిందు యక్షగాన ప్రదర్శన నాటకాలను వినిపించారు. 1999లో మద్రాసులో దక్షిణ చిత్రలో పది రోజుల పాటు ప్రదర్శనలు ఇచ్చి అక్కడి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. 2010లో తిరుపతిలోని శిల్పారామంలో ప్రదర్శన ఇచ్చారు. 2010లో హైదరాబాద్‌కు చెందిన స్పృహ సాహితీ సంస్థ సారయ్య ప్రదర్శనను గుర్తించి ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర్లు, చుక్క రామయ్య, ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు, సినీ దర్శకుడు బి.నర్సింగరావు, గేయ కవులు అందెశ్రీ, గోరటి వెంకన్న సమక్షంలో ఘనంగా సన్మానించి రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు.

యక్షగాన కళాకారులకు ఫించన్ మంజూరు చేయాలి



చిందు కళాకారులకు నెలకు రూ.10వేల చొప్పున పింఛను మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు, నివేశన స్థలాలు ఇవ్వాలి. ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి. చిందు కళాకారులు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలి. చిందు యక్షగాన కళాకారులకు గుర్తింపు కార్డులు, గద్దర్, కేంద్ర అవార్డులు ప్రదానం చేయాలి. చిందు కళాకారులకు హైదరాబాద్‌లో ఎకరం స్థలం కేటాయించి చిందు భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలి.

- గజవెల్లి సారయ్య, చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గడ్డి గింజల ఉత్పత్తిలో నెంబర్ వన్



- దేశంలోనే మొదటి స్థానంలో ముల్కనూర్ మహిళా డెయిరీ
- రూ.20కోట్లు కేటాయింపు.. క్వింటా గింజలకు గాను రైతుకు రూ.7500 చెల్లింపు
- ఈ సీజన్లో 6వేల క్వింటాళ్లు ఇతర రాష్ట్రాలకు తరలింపు
- ప్రణాళిక రూపొందించిన జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ


ఓ రైతు సాగు చేసిన జవారి గడ్డి గింజల చేను


ఇతర ప్రాంతాల నుంచి బస్తాల్లో వచ్చిన జవారి గడ్డి గింజలను దిగుమతి చేస్తున్న కార్మికులు

భీమదేవరపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేలు జాతి పశువులకు మేలైన గడ్డి జాతి గింజలను తయారు చేసేందుకు జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ప్రత్యేక ప్రణాళికలు చేపడుతోంది. గతంలో పాడి పశువులు 7-8 లీటర్ల పాలు ఇస్తేనే గగనం. అలాంటిది నేటి రోజుల్లో 15-20 లీటర్లు ఇచ్చే సంకర జాతి పశువులు అందుబాటులోకి వచ్చాయి. అలా ఎక్కువ మోతాదులో పాలు ఇచ్చే పాడి పశువులకు మామూలు పచ్చి మేత వేస్తే సత్ఫలితాలు రావని ఎన్‌డీడీబీ భావించింది. ఇందుకోసం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 60వేల క్వింటాళ్ల మేలైన గడ్డి గింజలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సహకార సంఘాల ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో మేలైన గడ్డి గింజలను తయారు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో పాడి పశువులకు పశువుల మేత అందుబాటులో ఉంచాలని ఈ పథకానికి ఎన్‌డీడీబీ శ్రీకారం చుట్టింది. పశువుల మేతలో అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలు, అధిక పోషకాలిచ్చే గడ్డి జాతి గింజలను విత్తనోత్పత్తి చేసి పాడి రైతులకు రాయితీపై అందించాలని లక్ష్యం నిర్దేశించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డెయిరీలకు మేలైన గడ్డి గింజలను ఉత్పత్తి చేసేందుకు విత్తనాలను సరఫరా చేసింది. అందులో భాగంగా ముల్కనూర్ మహిళా డెయిరీలో గడ్డి గింజల తయారీని చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుతం ముల్కనూర్ మహిళా డెయిరీ పరిధిలో గడ్డి గింజల ఉత్పత్తి పథకం ముమ్మరంగా సాగుతోంది .


గడ్డి గింజలను ప్యాక్ చేస్తున్న కార్మికులు

20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి

ముల్కనూర్ మహిళా డెయిరీ పరిధిలో 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టింది. డెయిరీ పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులచే పచ్చ జొన్న (జవారి జొన్న), మొక్కజొన్న విత్తనాలను తయారు చేయాలని విత్తనాలను పంపించారు. డెయిరీ పరిధిలో రైతులు పండించిన జవారి గడ్డి విత్తనాలకు క్వింటాల్‌కు రూ. 7500 చెల్లించాలని ధర నిర్ణయించారు. దీంతో డెయిరీ పరిధిలోని పలువురు రైతులు జవారి జొన్న గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు ముందుకు వచ్చారు.

ఉత్పత్తికి రూ.20 కోట్లు విడుదల

ముల్కనూర్ మహిళా డెయిరీలో 20వేల క్వింటాళ్ల జవారి, మొక్కజొన్న గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు రూ. 20కోట్ల నిధులను మహిళా డెయిరీకి ఎన్‌డీడీబీ విడుదల చేసింది. ఈ నిధులతో గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు డెయిరీ పరిధిలోని అధికారులు తీవ్రంగా రైతులతో శ్రమిస్తున్నారు. 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా 6వేల క్వింటాళ్ల గడ్డి విత్తనాలను దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రాష్ట్రాలకు తరలించారు.

రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తదితర రాష్ట్రాలకు గడ్డి విత్తనాలను పంపించారు. రత్నగిరి గ్రామంలోని ముల్కనూర్ సహకార బ్యాంక్ సీడ్ ప్లాంట్ ద్వారా తయారైన జవారి విత్తనాలను ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నారు. 3కిలోలు, 6కిలోల బ్యాగులలో ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రైతులు పండించిన జవారి విత్తనాలకు నేరుగా క్వింటాల్‌కు రూ. 7500 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. దీంతో నిధుల అవకతవకలకు పాల్పడకుండా ఉంటుందని ఎన్‌డీడీబీ ఈ చర్యలు చేపట్టింది.

20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తే లక్ష్యం..



ముల్కనూర్ మహిళా డెయిరీలో 20వేల క్వింటాళ్ల జవారి గడ్డి గింజలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 6వేల క్వింటాళ్ల గడ్డి గింజలను దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలించాం. మరో నెల రోజుల్లో మిగతా 14వేల క్వింటాళ్ల గడ్డి గింజలను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తాం. ఎన్‌డీడీబీ గడ్డి గింజల ఉత్పత్తి కోసం ముల్కనూర్ మహిళా డెయిరీకి రూ. 20కోట్ల నిధులను విడుదల చేసింది. 60వేల క్వింటాళ్ల గడ్డి గింజల దిగుబడి దేశంలో లక్ష్యంగా కాగా ఒక్క ముల్కనూర్ మహిళా డెయిరీ 20వేల క్వింటాళ్ల గడ్డి గింజలను తయారు చేసి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుంది.

- మార్పాటి భాస్కర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, ముల్కనూర్ మహిళా డెయిరీ

జవారి విత్తనాలు పండిస్తే ఎంతో లాభం



యాసంగిలో జవారి గడ్డి విత్తనాలు పండిస్తే ఎంతో లాభంగా ఉంది. యాసంగిలో నీటి ఎద్దడి ఉండడంతో నేను ముల్కనూర్ మహిళా డెయిరీ ద్వారా జవారి విత్తనాలను తీసుకొని రెండెకరాల్లో సాగు చేశాను. నా పంట ఎండి పోకుండా పండింది. క్వింటాల్‌కు రూ. 7500 ధరగా నిర్ణయించడంతో రైతులకు ఎంతో లాభం ఉంటుంది. ఎకరంలో 10-12క్వింటాళ్ల జవారి విత్తనాలు పండే అవకాశం ఉంది.

- సంగెం సదానందం, రైతు, కొప్పురు

ఖండాలు దాటిన ప్రేమ

- పెళ్లాడిన దక్షిణ అమెరికా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి
- కేసముద్రంలో ఘనంగా వివాహ వేడుక


కేసముద్రంలో కొలంబియా అమ్మాయి రియా, కేసముద్రం అబ్బాయి సాయిచైతన్య వివాహం

కేసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఖండాలు దాటిన వారి ప్రేమ.. పెళ్లితో నూరేళ్ల బంధానికి అడుగులు వేసింది. ఉన్నత చదువులు కోసం ఆస్ట్రేలియా వెళ్లి.. అక్కడే ఉద్యోగం చేస్తున్న క్రమంలో దక్షిణ అమెరికా ఖండం కొలంబియా దేశానికి చెందిన అమ్మాయితో తెలంగాణ అబ్బాయికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. చివరకు వారు అబ్బాయి స్వస్థలమైన తెలంగాణలో వివాహం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజేష్‌యాదవ్- ప్రసన్నలత దంపతుల పెద్దకుమారుడు సాయిచైతన్య ఉన్నత చదువుల నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లాడు. చదువు పూర్తయ్యాక అక్కడే ఒక ప్రముఖ కంపెనీలో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇక దక్షిణ అమెరికా ఖండంలోని కొలంబియా దేశం బొగోట్టా పట్టణానికి చెందిన యుక్లేడిస్ ఖింతేరో-వేల్గా మరియ దంపతుల కుమార్తె రియా కూడా ఆస్ట్రేలియాలో సాయిచైతన్య పని చేసే కంపెనీలోనే అకౌంటెంట్‌గా చేరింది. నాలుగేళ్ల క్రితం ఇద్దరికీ పరిచయం ఏర్పడగా అది ప్రేమగా మారింది. దీంతో ఆ ఇద్దరు తమ పెద్దలను ఒప్పించి గురువారం కేసముద్రం అమినాపురంలో హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. నాలుగు రోజులుగా హల్దీ, మెహందీ, సంగీత్ కార్యక్రమాలను నిర్వహించగా.. వధువు తరపున కొలంబియా నుంచి ఆమె అన్న సరియో, వదిన జులియానా హాజరయ్యారు. ఈ సందర్భంగా సరియో, జులియానాలు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించిన వివాహ వేడుకల్లో తాము పాల్గొన్నామని, ఈ సంస్కృతి, సంప్రదాయాలు తమకు చాలా నచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ దేశంలో గంటలోనే వివాహం జరిపించి, 50 నుంచి వంద మంది హాజరవుతారని, వందల సంఖ్యలో పెళ్లికి రావడం బంధాలకు ఇక్కడ అధిక ప్రాధాన్యతనిస్తారని తమకు అర్థమవుతోందని అన్నారు.

ఉన్నది రెండు నెలలు.. మొదలు కాని పనులు

- సరస్వతీ పుష్కరాలకు సమీపిస్తున్న సమయం
- భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లలో తీవ్ర నిర్లక్ష్యం
- రూ.25కోట్లు విడుదలై టెండర్లు పూర్తయినా ఫలితం శూన్యం




కాళేశ్వర ఆలయం

మహదేవపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పుష్కర స్నానం చేస్తే సకల పాపాలు పోతాయని పెద్దలు చెప్పిన మాట.. ఈ క్రమంలో పుష్కర స్నానాల కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఇక తెలంగాణలోనే ప్రాచీన పుణ్య క్షేత్రంగా.. ఒకే పానవట్టంపై రెండు లింగాలు, గోదావరి ప్రాణహిత అంతర్వాయిహినిగా సరస్వతిగా మూడు నదులు, మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండి త్రిలింగాలలో ఒకటిగా విలసిల్లుతున్న కాళేశ్వరానికి భక్తులు లక్షలాదిగా తరలొస్తారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రం వద్ద మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు జరగనుండగా.. 12ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే భక్తులకు ఎలంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.25కోట్ల నిధులు మంజూరు చేయించారు. పనులకు టెండర్లు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో సరస్వతి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. కానీ నేటికీ ఏ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు. గతంలో కూడా రూ.25 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే పదేళ్ల దాటినా ఇంకా పనులు పూర్తి కాక ఎక్కడివక్కడే మిగిలిపోయాయి. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాలకు 12రోజుల్లో 50వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తే ఈ 2025లో జరిగే మహాసరస్వతి పుష్కరాలకు 5లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి. రూ.కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తయితాయా లేదా అనేది ప్రశ్నార్థకమే. ఈ సరస్వతి పుష్కరంలోనే ఇండియాలోనే గంగా యమున, సరస్వతి పుష్కరాలకంటే తెలగాణలో జరిగే అతి ప్రాచీనమైన, పవిత్రమైన గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల్లో స్నానాలు చేస్తే ఎంత భాగ్యం కలుగుతుందని, అంత దూరం పోకుండా తెలంగాణలో జరిగే పుష్కరాల్లో స్నానం చేస్తే మరింత పుణ్యం వస్తుందని పురోహితులు తెలిపారు. మేలో జరిగే పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క పని కూడా కాకపోవడం గమనార్హం. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 8, 18 లక్షలకు గాను 26 పనులకు నిధులు మంజూరవగా పంచాయతీ రాజ్‌కు రూ.3కోట్లు మంజూరయ్యాయి.

ఇరిగేషన్‌కు 5కోట్లు మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్, మరుగుదొడ్ల కోసం రూ.2.23కోట్లు మంజూరయ్యాయి. దీంతో పాటు అన్ని పనులకు సీసీ రోడ్లు, ఇతర పనులకు రూ.26కోట్లకు పనులు మంజూరు చేసి టెండర్లు పూర్తి చేసింది. మందుటెండలు ఎక్కువగా ఉండడంతో మేలో జరిగే పుష్కరాలకు తొందరలోనే పనులు పూర్తి చేయాలని పలువురు భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఔషధఫలం రేగు..




చిన్న రేగు చెట్టు



ఔషధగుణాల సమాహారం..

రేగు పండ్లు రుచికి మాత్రమే కాదు.. ఆరోగ్యానికి అద్భుతంగా ఉపకరించే ప్రకృతి వరఫలం కూడా. ఇందులో అనేక ఔషధగుణాలున్నాయి. రేగు పండ్లతో తయారు చేసిన మందులు, జీర్ణ శక్తి, ఆకలి పెరగడం, రక్తహీనత నివారణ, విసుగు, నీరసం, శ్వాసనాళాల వాపును తగ్గించేందుకు కీలకంగా ఉపయోగపడుతాయి. గొంతు నొప్పి, హిస్టీరియా, అజీర్తి, కడుపులోమంట సమస్యలను తగ్గించేందుకు అద్భుతంగా పనిచేస్తాయి. పండ్లు మాత్రమే కాకుండా రేగు చెట్టు ఆకులను నూరి కట్టిపెడితే పుండ్లగాయాలు మానిపోతాయి. రేగు చెట్టు బెరడుతో తయారుచేసిన ఔషధాలు జ్వరం, తలనొప్పి, అతిసార, విరేచనాలను అరికడుతాయి. రేగుపండ్లలో సీ విటమిన్‌తో పాటుగా ఏ, బీ1, బీ2, బీ3 విటమిన్లు లభిస్తాయి. వీటిలో చక్కెర, పిండిపదార్థాలు ఉంటాయి. రేగు పండ్లు రోగనిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా చెడుకొవ్వును కూడా కరగదీస్తాయని, మనసు బాగలేనప్పుడు రేగుపండ్లను తింటే మనసుకు స్వస్థత చేకూరుతుందని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు.

రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం

లింగాలఘణపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే అనేక పండ్లలో రేగు పండ్లకు ప్రత్యేక స్థానముంది. ఉండేది చిన్న సైజు అయినా మనిషికి పెద్ద ప్రయోజనమే ఒకగూరుస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ రేగు పండ్లలో అనేక రకాల ఔషదగుణాలు ఉండటం విశేషం. 4వేళ ఏళ్ల క్రితం నుంచే రేగు పండ్లను మానవాళి ఎంతో ఇష్టంగా తింటుందని చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేగు పండ్లు పుష్కలంగా లభించే సీజన్. ఉష్ణమండల ప్రాంతాల్లో పెరిగే రామ్నేసి కుటుంబంలోని జిజిఫస్ జాతికి చెందింది. దీని శాస్త్రీయనామం జిజిఫస్ మార్టియానా. వీటిని తింటే రుచికి తియ్యతియ్యగా.. కాస్త పులుపుగా ఉండే రేగు పళ్లను నోట్లో వేసుకుని చప్పరిస్తుంటే అప్రయత్నంగానే కళ్లు అరమూతలు పడుతుంటాయి. రేగు పండ్ల రుచికి మంత్రముగ్ధుడైన మహావిష్ణువు ఒకనాడు రోజంతా రేగు పండ్లను తిని కడుపు నింపుకున్నాడట అందుకే ఆయనను బదరీ నారాయణుడు అని కూడా పిలుస్తారు. భారతదేశంలో 90 రకాల రేగుజాతులు అందుబాటులో ఉన్నాయి. మొదట చైనాలో మాత్రమే లభించిన రేగు పండ్లు ఆ తర్వాత అమెరికా, ఇండియా, శ్రీలంక, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాలను కూడా చుట్టేశాయి. పెరుగుతున్న ఆధునిక వంటల విధానాల్లో రేగు పండ్లను భారతీయులు అనేక ఆహార రుచులతో ఆస్వాదిస్తున్నారు. జామ్, జెల్లీ, పానీయాల తయారీలోను, స్వీట్లు, సలాడ్స్‌లో వినియోగిస్తున్నారు.

బాధితులకు దక్కని పరిహారం

మావోయిస్టుల చేతిలో హతమైన ఇద్దరు ఆదివాసీలు ● దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు

వాజేడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు ఆదివాసీలను గతేడాది మావోయిస్టులు హత్య చేశారు. కుటుంబ పెద్ద దిక్కులను కోల్పోయిన ఆ రెండు కుటుంబాలు ఇప్పుడు దీన స్థితిలో ఉన్నాయి. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ పరిరంగా ఈ కుటుంబాలకు అందాల్సిన పరిహారం పత్తాకు లేకుండా పో యింది.



మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన రమేష్, అర్జున్ (ఫైల్)

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ అడవుల సరిహద్దులోని పెనుగోలు గుట్టలపై నివసించే ఉయిక రమేష్, ఉయిక అర్జున్ కుటుంబాలు సుమారు 15 ఏళ్ల క్రితం కిందికి దిగాయి. మండలంలోని కేంద్రంలోని పెనుగోలు కాలనీలో నివాసం ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నాయి. పెనుగోలు గుట్టలపై ఉంటూనే రమేష్ డిగ్రీ చదివి పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం పొందాడు. మండలంలోని పేరూరు కార్యదర్శిగా పనిచేశాడు. రమేష్‌కు వరుసకు సోదరుడైన ఉయిక అర్జున్ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రమేష్-రాంబాయి దంపతులకు ముగ్గురు పిల్లలకు కాగా, అర్జున్- సావిత్రి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. సంతానం.

సంచలనం రేపిన హత్యలు

జిల్లాలోని ఏజెన్సీ మండలమైన వాజేడులో 2003 తర్వాత మావోయిస్టులు హతమార్చిన సంఘటనలు 2024 నవంబరు వరకు దాదాపు లేవు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 21న అర్ధరాతి ఏక కాలంలో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పెనుగోలు కాలనీలో మావోయిస్టులు రమేష్, అర్జున్‌ను ఇన్‌ఫార్మర్ల నెపంతో గొడ్డళ్లతో నరికి చంపారు. ఈ సంఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో ఇద్దరి మృతదేహాలతో కుటుంబ సభ్యులు, స్థానికులు, ఆదివాసీ నాయకులు నిరసనకు దిగారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని రాస్తారోకో చేశారు.

నేటికీ అందని డబ్బు

మావోయిస్టుల చేతిలో హతమైన కుటుంబాలకు పోలీసు శాఖ నుంచి పరిహారం అందిస్తామని పోలీసు అధికారులు ఆ సమయంలో హామీ ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ. 25లక్షలు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని జిల్లా పోలీసు అధికారులు, ఎమ్మెల్యే మాటిచ్చారు. అప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తమకు అందలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగామని, అయినప్పటికీ ఇంత వరకు తమకు పరిహా రం అందలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారంగా కుటుంబ పోషణ

మావోయిస్టుల చేతిలో హతమైన ఇద్దరి కుటుంబాల తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. రమేష్‌కు ముగ్గురు పిల్లలు కాగా, అర్జున్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. రమేష్ జీవించి ఉన్న సమయంలో ఏడేకరాలు మిర్చి తోటను వేసేందుకు చాలా అప్పులు చేశాడు. ప్రస్తుతం ఆ తోటను రమేష్ భార్య రాంబాయి దగ్గరుండి చూసుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. అర్జున్ భార్య సావిత్రి తన ముగ్గురు ఆడపిల్లలను చదివించేందుకు మిర్చి తోటల్లో రోజువారీ కూలి పనులకు వెళ్తోంది. అర్జున్ పిల్లలు ఇంటర్, పదో, ఎనిమిది తరగతులను వివిధ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నారు.

ఉద్యోగం ఇవ్వాలి

- రాంబాయి, రమేష్ భార్య



ముగ్గురు పిల్లలతో కుటుంబ పోషణ భారం అవుతోంది. మిర్చి తోట నిమిత్తం రమేష్ అప్పులు చేశాడు. తోట కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నాను. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారంతో పాటు నా భర్త ఉద్యోగం వచ్చేలా చూడండి.

కూలికి పోతేనే ఇల్లు గడుస్తోంది..

- సావిత్రి, అర్జున్ భార్య



నేను కూలికి పోతేనే మా కుటుంబం కడుపు నిండుతోంది. ముగ్గురు ఆడపిల్లలను ఎలా చదివించాలో అర్థం కావడం లేదు. ఆ డబ్బులు ఎటూ సరిపోవడం లేదు. ఆ రోజు అధికారులు వచ్చి నష్ట పరిహారం వచ్చేలా చూస్తామని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు అలాంటివేమీ అమలు కాలేదు.

సమానత్వం కోసం మహిళలు పోరాడాలి

అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సమ్మక్క



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు సమానత్వం కోసం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం స్ఫూర్తితో పోరాడాలని అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కూరెందుల సమ్మక్క అన్నారు. ములుగులోని సీఐటీయూ కార్యాలయంలో సరిత అధ్యక్షతన గురువారం శ్రామిక మహిళా జిల్లా సదస్సు జరిగింది. ఈసందర్భంగా సమ్మక్క మాట్లాడుతూ 115 సంవత్సరాల క్రితం శ్రామిక మహిళా కార్మికవర్గం పోరాడి తమ హక్కులను సాధించుకున్న రోజు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవమని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కుల కోసం, సమాన పనికి సమాన వేతనం కోసం మహిళలు ఉద్యమించాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగించాలన్నారు. ఈసదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, రమ, నిర్మల, కవిత, నసీమా, సమ్మక్క, రోజారాణి, లక్ష్మి, శ్రీకళ, శారదాదేవి, సీతారత్నం, నాగమణి, అమృత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పోస్ట్‌కార్డు ఉద్యమం



పోస్టుకార్డులను బాక్స్‌లో వేస్తున్న ఉద్యమకారులు

ములుగు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారులు గురువారం మల్లంపల్లిలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 220 చదరపు గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు అందించాలని, రూ.25వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్టుకార్డులను సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ద్రోణాచారి, మాచర్ల ప్రభాకర్, రాజేశ్వర్‌రావు, హరినాథ్, బోయిని రవి, రేణుకుంట్ల సురేష్, చీదర సంతోష్, లింబాద్రి, మనోహరస్వామి, శ్రీనివాసరెడ్డి, రాజమొగిలి, చంద చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి

వెంకటాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఆదివాసీ నవ నిర్మాణసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం మండలంలోని యోగితానగర్ నుంచి మండల కేంద్రం వరకు నాయకులు పాదయాత్ర చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకుడు పూనెం సాయి, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

తాడ్వాయి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి గోపాల్‌రావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, మెడిసిన్, రోగుల నమోదు రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ చిరంజీవితో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలోని సమస్యలు, వైద్య శిబిరాల ఏర్పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రకాంత్, డీపీఎంవో సంజీవరిపు, స్టాఫ్‌నర్స్ స్పందన ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మల్లంపల్లిలో వైద్య శిబిరం

ములుగు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 9వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మల్లంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం వైద్యశిబిరం జరిగింది. ఈసందర్భంగా 112 మంది విద్యార్థులకు వైద్యులు సంధ్య, లీచంద్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా యోగాలో మెడిటేషన్, ఆసనాలు, హెల్త్‌డైట్, వడదెబ్బ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఉష, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వెంకటాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ములుగు ఎఫ్‌ఆర్‌వో డోలి శంకర్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. ఈమేరకు ఎఫ్ఆర్‌వో శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో గ్రామ సమీపంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈక్రమంలో మూడు ట్రాక్టర్లు ఇసుకతో తారసపడడంతో డ్రైవర్లు వాటిని వదిలి పారిపోగా అదుపులోకి తీసుకున్నామన్నారు. తమ విచారణలో పొర్కలపల్లి గ్రామానికి చెందిన గణపతి, వెంకట్రావు, శ్రీనివాసరావులకు చెందిన ట్రాక్టర్లుగా నిర్ధారణ అయిందని తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను ములుగు రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఇంటర్ విద్యార్థులకు ఎస్కార్ట్ తప్పనిసరి

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యో): ఇంటర్మీడియట్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు ఎస్కార్ట్‌గా ఉపాధ్యాయుడు ఒకరు తప్పనిసరిగా ఒకరు తోడుండాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. జిల్లాలోని 11 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ఆరు మోడల్ స్కూల్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆమె గురువారం జూమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తరలించే సమయంలో ఉపాధ్యాయుడు ఒకరు తప్పనిసరిగా ఎస్కార్ట్‌గా ఉండాలని సూచించారు. అలాగే దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. పరీక్ష రాసి వచ్చిన విద్యార్థులకు ఆహారాన్ని అందించే విషయంలో కూడా శ్రద్ధ వహించాలని, లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని అధికారులకు హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఈవో ముద్దమల్ల రాజేందర్, ఆర్టీసీ డీఎం ఇందు, అన్ని గురుకులాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సింగరేణి పాఠశాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గత నవంబరులో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సింగరేణి పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న మాచర్ల అశ్రిత పాల్గొంది. ఫైర్ యాక్సిడెంట్స్ జరిగినప్పుడు ఎలా బయటపడాలనే విషయంపై ప్రాజెక్టు చేసి, డెమో ద్వారా వివరించింది. ఆమె ప్రాజెక్టు వివరాలను జిల్లా సైన్స్‌ఫెయిర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి పంపించారు. ఈ క్రమంలో 2024-25 విద్యాసంవత్సరానికి దేశ వ్యాప్తంగా 3,311 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వారి వివరాలను గురువారం విడుదల చేసింది. అందులో ఈ పాఠశాల విద్యార్థిని అశ్రిత ప్రాజెక్టు కూడా ఎంపికైంది. ఈ సందర్భంగా అశ్రితను సింగరేణి పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ మారుతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి అభినందించారు.

జాతరలో ఉత్తమ వైద్య సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో

రేగొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : కోటంచ లక్ష్మీనరసింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఉత్తమ సేవలు అందించేలా కృషి చేయాలని భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్ వైద్య సిబ్బందికి సూచించారు. కోటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో వైద్య శాఖ తరపున చేయాల్సిన ఏర్పాట్లపై మండల కేంద్రంలోని పీహెచ్ సీలో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జాతరలో రెండు 108 వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ సాం క్రమిక వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగాబీపీ, డయాబెటిస్ వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

ఎమ్మెల్సీల విజయంపై హర్షాతిరేకం

కాటారం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించడంతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని విజయోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు పాగె రంజిత్ మాట్లాడుతూ టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలిచి డబుల్ ధమాకా సాధించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర బీజేపీదేనని, రాబోయే అసెంబ్లీ ఎన్నికలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్ దుర్గం తిరుపతి, బీజేపీ జిల్లా, మండల నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, గంట అంకయ్య, జిల్లెల్ల శ్రీశైలం, బండం మల్లారెడ్డి, స్వామి యాదవ్, డోలి అర్జయ్య, బొంతల రవీందర్, హన్మయ్య, తిరుపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, మధు, పర్వతాలు, సుధాకర్, సతీష్, ఆశయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడంపై మండలంలోని యామన్‌పల్లిలో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్ మాటాడుతూ కాంగ్రెస్ 14 నెలల పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. అందుకే ఉపాధ్యాయులు, పట్టభద్రులు బీజేపీని గెలిపించుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.



మహదేవపూర్‌లో బీజేపీ శ్రేణుల ఆనందోత్సవాలు

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా మహదేవపూర్ మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు బస్టాండ్ ఆవరణలో బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మహదేవపూర్ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా బీజేపీ పార్టీ ఎదుగుతోందని తెలిపారు. బీజేపీ ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు.



కాటారంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

కాటారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొంత కాలంగా ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయా పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏడబ్ల్యూటీలు, ఏడబ్ల్యూహెచ్‌ల పోస్టుల భర్తీపై ప్రకటన చేయనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకునేలా నోటిఫికేషన్ వెలువరించనుంది. ఐసీడీఎస్ మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలోని కాటారం, గంగారం, మహదేవపూర్, సూరారం, పలిమెల, యామన్‌పల్లి, వల్లెంకుంట, తాడిచర్ల తదితర సెక్టార్ల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయా పోస్టుల భర్తీ ఎట్టకేలకు జరగనుండటంతో ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



కాటారం మండలం గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం

ప్రాజెక్టు పరిధిలో 21 టీచర్లు, 41 ఆయా పోస్టులు ఖాళీ

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి పథకం) మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలోని కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల పరిధిలో ప్రస్తుతం 21 ఏడబ్ల్యూటీ (టీచర్), 41 ఏడబ్ల్యూహెచ్(ఆయా) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో సుంద్రాజ్ పేట-1 అంగన్‌వాడీ టీచర్ పోస్టు కోర్టు కేసులో ఉంది. కాటారం మండలంలోని జాదరావుపేట, చింతకాని-2, బొప్పారం, శంకరంపల్లి, గంగారం-2 సెంటర్లు, మల్హర్ మండలంలో వల్లెంకుంట-1, ఎడ్లపల్లి-1, తాడిచర్ల-1, 2, 4, 6, నాచారం-1, మహదేవపూర్ మండలంలో ఇప్పలబోరు, బొమ్మాపూర్-1, మజీద్‌పల్లి, మహదేవపూర్-2, 7, సూరారం-4, మహముత్తారం మండలంలోని కొర్లకుంట-1, పలిమెల మండలంలోని పంకెన-1 కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాటారం మండలంలోని పరికిపల్లి, మల్లారం, దేవరాంపల్లి ఎస్సీ కాలనీ, గట్లకుంట, చింతకాని, కాటారం-2, దామెరకుంట-3, బోడపల్లి, మల్హర్ మండలంలోని శభాష్‌నగర్, కొండంపేట-2, అన్‌సాన్‌పల్లి-2, పీవీ నగర్, చిన్నతూండ్ల-2, వల్లెంకుంట-1, కిషన్‌రావుపల్లి, మహదేవపూర్ మండలంలో మహదేవపూర్, మహదేవపూర్-2, 4, మద్దులపల్లి, ఏన్కపల్లి, బీరసాగర్, మెట్‌పల్లి, అంబట్‌పల్లి-1, సూరారం-1, 3, అన్నారం-1, కిష్టరావుపేట, మహ ముత్తారం మండలంలోని యత్నారం, లక్ష్మీపూర్, హుజూర్‌నగర్, దుబ్బగూడెం, పర్లపల్లి, దౌతుపల్లి, కొర్లకుంట-1, జీలపల్లి, పలిమెల మండలంలోని అప్పాజీ పేట, బోడాయిగూడెం-2, ముకునూర్, లెంకలగడ్డ, వెంచంపల్లి కేంద్రాల పరిధిలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీవో రాధిక తెలిపారు. చనిపోయిన, 65ఏళ్లు నిండిన, రాజీనామా చేసిన, గతం నుంచి ఖాళీగా ఉన్న కేంద్రాల్లోని పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుండటంతో ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన మహిళలు నోటిఫికేషన్ కోసం వేచిచూస్తున్నారు.

పెద్ద పులి కాదు.. జంగ పిల్లి

● పాదముద్రలు నిర్ధారించిన ఫారెస్టు అధికారులు

రేగొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లిగోరి మండలంలో పులి సంచరిస్తోందంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ కావడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. దీంతో స్పందించిన అటవీ శాఖ అధికారులు పులి సంచరించిందంటూ వీడియోలో కనిపించిన ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. అది పెద్దపులి కాదని, జంగ పిల్లి అని తేల్చారు. పులి వీడియో తీసిన మహిళ జూమ్ చేయడంతో జంతువు పరిమాణం పెద్దగా కనిపించిందని అన్నారు. అలాగే అక్కడ పరిశీలిస్తే పిల్లి పాదముద్రలు కనిపించాయని తెలిపారు. మగ జాతికి చెందిన అడవి జంగపిల్లి కొంచెం పెద్దగా ఉంటుందని, అందుకే పులిగా భావించారని అన్నారు. రైతులు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. పరిశీలించిన వారిలో ములుగు డివిజన్ అటవీశాఖ అధికారి శంకర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గౌతమి, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గంగస్నానానికి వన దేవతలు

మంగపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొత్త మల్లూరు గ్రామపంచాయతీ పరిధి మామిడిగూడెంలో గిరిజన జాతర కొనసాగుతోంది. సమ్మక్క, సారలమ్మ, పగిద్దరాజు, గోవిందరాజులు, నాగులమ్మ, కిష్టస్వామి, పోతురాజులు గురువారం గద్దెల సమీపంలోని గోదావరిలో గంగ స్నానానికి వెళ్లారు. వన దేవతలను గుడి నుంచి గోదావరికి ఊరేగింపుగా వెళ్లి గంగ స్నానం చేయించారు. అనంతరం రాత్రి వరకు తిరిగి గుడికి వన దేవతలను ఆదివాసి సంప్రదాయాల ప్రకారం గుడికి దేవర బాల పూనెం జనార్దన్, వడ్డె రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, దేవర కర్రలు వాసం సాంబ శివరావు, ఎట్టి సాయి, తాటి చందూ, నాగ మల్లేష్ ఆదివాసి కుల పెద్దలు పూజ ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు.



మల్లూరులో గంగ స్నానానికి వెళ్తున్న వన దేవతలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారిగా వీరునాయక్

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జిల్లా అధికారిగా వీరునాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా ఏడీ క్యాడర్ అధికారి విజయభాస్కర్ కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో పూర్తి స్థాయి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా ప్రభుత్వం వీరునాయక్‌ను నియమించింది. గతంలో ఈయన జనగామ జిల్లాలో డీఏఓగా పని చేసినట్లు తెలిసింది. మరోవైపు ప్రస్తుతం కొనసాగుతున్న విజయభాస్కర్ సైతంజిల్లా నుంచి బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.